క్లుప్తంగా

సర్వే త్వరగా పూర్తి చేయండి

- ఆర్డీవో ఈట్ల కిశోర్



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకి సంబంధించి డివిజన్‌లో 29 గ్రామాల్లో మూడో విడత జరుగుతున్న నేపథ్యంలో భూముల కచ్చితత్వం, విలువ, ఖతా నంబరు అంశాలపై త్వరగా సర్వే పూర్తి చేయాలని ఆర్డీవో ఈట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం డివిజనల్‌లో తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మ్యుటేషన్ షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి శ్మశానాల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు వేగవంతం చేయాలన్నారు. సర్వే ముగిసిన గ్రామాల్లో సర్వేకి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తక్షణం అభ్యంతరాలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. జాతీయ రహదారుల భూ సేకరణ వేగవంతం చేయాలని, జగనన్నకి చెబుదాం స్పందన వంటి దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కాకినాడ లీగల్: భూ హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు న్యాయవాదులు నిరసన ర్యాలీ చేపట్టారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భూ హక్కు చట్టాన్ని రద్దు వెంటనే చేయాలని కోరారు. న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు బీసీ కులాల ఆత్మీయ వనభోజనం

కాకినాడ సిటీ: స్థానిక మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే బీసీ కులాల ఆత్మీయ వనభోజన మహోత్సవానికి జిల్లాలోని బీసీ కులాల వారంతా కుటుంబ సభ్యులతో సహా హాజరుకావాలని ఆర్గనైజింగ్ కమిటీ పిలుపునిచ్చింది. రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదని, అన్ని వర్గాలకు చెందిన బీసీల ఐక్యత చాటేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చొల్లంగి వేణుగోపాల్, పప్పు దుర్గాప్రసాద్, గుబ్బల తులసీకుమార్ తదితర నాయకులు పాల్గొని వనభోజనాల ఏర్పాట్లుపై మాట్లాడారు. అనంతరం భోజనాల ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు.

పెద్దాపురప్పాడులో ఉచిత వైద్యశిబిరం

కరప: మండలం పెద్దాపురప్పాడులోని న్యూజియోన్ జీసస్ బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, పవర ట్రినిటీ హాస్పటల్ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ వైద్యులతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. విలియమ్స్ చారిటబుల్ సొసైటీ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ మార్క్ స్టీఫెన్ ఆనంద్, పవర ట్రినిటీ హాస్పటల్ డైరెక్టర్ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం ప్రారంభించారు. పెద్దాపురప్పాడు పరిసర గ్రామాల నుంచి 250 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, బి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

కాకినాడ సిటీ: కాకినాడ పగోడ మున్సిపల్ స్కూల్ ఆవరణలో భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, పాఠశాల తనిఖీ అధికారి వీపీజే వాణీకుమారి, సర్వశిక్ష కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని భవిత కేంద్రాల్లో విద్యార్థులకు అందుతున్న సేవలను వివరించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

కాకినాడ సిటీ: అంగన్‌వాడీల సమస్యలపై నాలుగో రోజు శుక్రవారం కూడా సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మలక రమణ, చంద్రావతి, మేడిశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి వారు సంతాపం తెలిపారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం

కాకినాడ సిటీ: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణంపై సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటన్నారు. పీడీఎఫ్ తరఫున శాసనమండలిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల వాణిని వినిపించారన్నారు. మన రాష్ట్రంలో యుటీఎఫ్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారని, రాష్ట్ర అధ్యక్షుడిగా చాలా కాలం పని చేశారని రాజశేఖర్ అన్నారు. సాబ్జీ కుటుంబ సభ్యులకు సీపీఎం జిల్లా కమిటీ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

ముక్తిప్రదాతా.. మధుసూదనా..

- నేటి నుంచి ధనుర్మాసం
- కళకళలాడనున్న వైష్ణవ ఆలయాలు
- ఇంటి ముందు ముగ్గులు, గొబ్బెమ్మల సందడి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలోని వైష్ణవాలయాలు ధనుర్మాస వేడుకలకు సమాయత్తమయ్యాయి. ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో రంగురంగుల ముగ్గులు వేసి సుందరంగా తయారు చేశారు. నెల రోజులు పాటు ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. దాతల సహకారంతో ఉదయం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసేందుకు దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తిరుప్పావై పఠించేందుకు ఏర్పాట్లు చేశారు. హిందువుల విశ్వాసాల ప్రకారం ధనుర్మాసం మతపరమైన ఆరాధన, తీర్థయాత్రలకు ఎంతో కీలకమైనది. ఈ సమయంలో సూర్యుడు దక్షిణాయణం చివర్లో, ఉత్తరాయణ ప్రారంభంలో ఉంటాడు. ఈ కాలంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది. ధను సంక్రాంతి సమయంలో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఈ మాసంలో ఆండాళ్‌పూజ, తిరుప్పావై పఠనం, గోదాదేవి కల్యాణం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేస్తారు.

తిరుప్పావై

తెలుగు పంచాంగం ప్రకారం, మార్గశిర మాసంలో పౌర్ణమి తర్వాత పాడ్యమి నుంచి వైష్ణవులు ధనుర్మాస వ్రతాన్ని ప్రారంభిస్తారు. ఈ మాసం విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైనది. ఈ కాలంలో గోదాదేవి మార్గళి వ్రతం చేసి నారాయణుడిని ఆరాధించింది. ధను సంక్రమణ కాలంలో నదీస్నానాలు, పూజలు, జపాలు చేయడం వల్ల శుభ ఫలితాలు వస్తాయని చాలా మంది నమ్ముతారు. ఈ నెలలో బ్రహ్మ ముహూర్తంలో నారాయణ పారాయణ చేసిన వారు దైవానుగ్రహాన్ని పొందుతారని విశ్వాసం.



ధనుర్మాస వేడుకులకు ముస్తాబవుతున్న, కాకినాడ దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి

సాక్షాత్తు భూదేవి అవతారమైన ఆండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అంటే పవిత్రం, పావై అంటే వ్రతం అని అర్థం. వేదాలు, ఉపనిషత్తుల సారమే తిరుప్పావై అని హిందూ పురాణాల్లో పేర్కొనబడింది.

ఇంటి ముందు గొబ్బెమ్మలతో

ధనుర్మాసంలో శ్రీవిష్ణుమూర్తిని మధుసూదన పేరిట పూజిస్తారు. ఈ నెలలో తొలి పక్షం రోజులు చక్కెర పొంగలి, పులగం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ కాలంలో పెళ్లి కాని కన్యలు తమ ఇంటి ముగ్గులు, గొబ్బెమ్మలతో పూజించడం వల్ల తమ కోరికలన్నీ నెరవేరుతాయి. ఇంటి ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, వాటిని బియ్యం పిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. ఈ నెలలో గోదాదేవి మార్గళి వ్రతం పేరిట మహావిష్ణువును పూజించి మోక్షం పొందిందని పురాణాల్లో పేర్కొన్నారు. ఈ ధనుర్మాసం వ్రతం వివరాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాలు, భాగవతం, నారాయణ సంహితాల్లోను కనిపిస్తాయి.

వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



కాకినాడ జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఆయా దేవాలయాల ఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతి ఆలయంలోను దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

– పులి నారాయణమూర్తి, జిల్లా దేవదాయశాఖాధికారి

నేటి నుంచి రజత దశావతార అలంకార ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో శనివారం నుంచి 2024 జనవరి 15 వరకూ ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజత దశావతార అలంకార ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఈఓ వి.శ్రీనివాసరావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు, మహావిష్ణు అలంకారం, ఉత్తర ద్వార దర్శనం, స్వామి వారికి బేడా ఉత్సవం జరుగుతాయన్నారు. 24న హనుమద్వ్రతం సందర్భంగా ఆలయంలో స్వయంగా వెలసిన ఆంజనేయస్వామి వారికి నాగవల్లీ దళయుక్త గంగ సిందూరం విశేష అర్చన, వడమాల కైంకర్యం, జనవరి 13న గోదా అమ్మవారికి నీరాట్ల ఉత్సవం, 14న గోదాకల్యాణం జరుగుతాయన్నారు. ఈ నెల 23న మహావిష్ణు, 24న మత్స్యావతారం, 25న కూర్మావతారం, 26న వరాహావతారం, 27న నరసింహావతారం, 28న వామనావతారం, 29న పరశురామావతారం, 30న రామావతారం, 31న బలరామావతారం, జనవరి 1న కృష్ణావతారం, 2న బుద్ధావతారం, 3న కల్కి అవతారం, 4న జగన్మోహిని అవతారం, 5న వేంకటేశ్వరస్వామి అవతారం, 6న శేషశయన అవతారం, 7న లక్ష్మీ హయగ్రీవ అవతారం, 8న ధన్వంతరి అవతారం, 9న దత్తాత్రేయ అవతారం, 10న విశ్వరూప సందర్శన అవతారం స్వామి భక్తులకు దర్శనమిస్తారన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా లక్ష్యం

- 20 నాటికి క్లెయిమ్‌లు పరిష్కరించాలి
- ఈఆర్ఓ నాగ నరసింహారావు ఆదేశం



కాకినాడ: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 ప్రక్రియలో భాగంగా 20వ తేదీ నాటికి ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన అన్ని క్లెయిమ్‌లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఈఆర్ఓ, నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సంబంధిత బీఎల్వోలు, అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఏఈఆర్వోలతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాకు సమయం దగ్గర పడుతున్నందున వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. 8, 9 తేదీల్లో వచ్చిన క్లెయిములను పరిశీలించి సత్వరమే క్లియర్ చేయాలని ఆదేశించారు. పారదర్శకమైన, దోషరహిత ఓటర్ల జాబితా లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్వోలు సీతాపతి రావు, మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: ప్రతాప్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ట్రెజరీ కాలనీ ఫీడర్ వెంబడి చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శనివారం ఉదయం 7గంట నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ట్రెజరీ కాలనీ, టీచర్ కాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియా, బంగారు వారి వీధి, ప్రతాప్ నగర్, సుభాన సాహెబ్ వీధి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ జి.ప్రసాద్ కోరారు.

స్వార్థ రాజకీయాలకు బుద్ధి చెప్పండి



వై ఏపీ నీడ్స్ జగన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పదో డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ : రాజకీయ స్వార్థం తప్ప ప్రజా సంక్షేమం పట్టని తెలుగుదేశం, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక పదో డివిజన్ తారకరామా నగర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ద్వారంపూడి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన టీడీపీ ఇప్పుడు అనేక తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజల ముందుకు వస్తోందన్నారు. కుటిల రాజకీయాలు చేస్తూ జనసేన వంటి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నారన్నారు. ఎన్ని దిగజారుడు రాజకీయాలు చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గడచిన నాలుగున్నర ఏళ్లలో పదో డివిజన్‌లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.101.30 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. స్థానిక నాయకులు వాసిపల్లి కృష్ణ, వాసిపల్లి రాంబాబు, ఎరిపల్లి సీతారామ్, ఎరిపల్లి సత్యం, మోసా పేతురు, పేర్ల దుర్గారావు, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై పోటీలు

బోట్‌క్లబ్: జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగదారుల హక్కులపై పోటీలు నిర్వహించారు. జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు ఎస్.హెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం రోజున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

కరప: స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో ఎయిమ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రెవరెండ్ ఎస్‌ఏ గాడ్విన్, కోఆర్డినేటర్ రెవరెండ్ ఎం.రాజ్‌కుమార్‌లతో కర్పి సర్పంచ్ ఆశాజ్యోతి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 50 మంది స్వచ్ఛ సేవకులకు రగ్గులు పంపిణీ చేశారు. గొడ్డటిపాలెం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కృష్ణమోహన్, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, పిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం



వాకాడలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ పేర్కొన్నారు. మండలం వాకాడలో శుక్రవారం జరిగిన వికసిత్ భారత సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా దేశ నాయకుల వేషధారణలతో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులు, ఇతర పథకాలను లబ్ధిదారులకు అధికారులు, నాయకులు అందజేశారు. తర్వాత వేళంగిలో కూడా వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే లబ్ధిదారులను ఎంపిక చేసి, కేంద్ర పథకాలను అందజేశారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు ఎస్.రాంబాబు, ఎ.వర్ధన్, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, రూరల్ నియోజకవర్గ కన్వీనర్ పి.లీలావతి, కనికెళ్లి వీర్రాజు, టి.నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు చెక్కపల్లి ఫకీర్రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కాకినాడ సిటీ: వికసిత భారత్ సంకల్ప యాత్ర శనివారం కరప మండలం నడకుదురు పంచాయతీ పరిధిలోని కుసుమ సత్య ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసినట్లు జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి శుక్రవారం సాయంత్రం తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత కార్యక్రమాల అమలు, వాటిపై అవగాహన, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులు, ప్రజలు హాజరుకావాలని సీఈవో కోరారు.

త్వరలో వేంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

కాకినాడ: పూర్తి రాతికట్టడంతో స్థానిక సాంబమూర్తి నగర్‌లో నిర్మిస్తున్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో త్వరలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం చెప్పారు. రూ.4 కోట్లు సొంత నిధులతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. విశాఖలోని వైభవ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పంచతంత్ర ఆగమ పండితులు గోపినంబాల శ్రీమాన్ వాసుదేవాచార్యులు(వాసుస్వామి), శ్రీమాన్ శేషాచార్యులు (శేషు స్వామి)తో కలసి ఎమ్మెల్యే ద్వారంపూడి విగ్రహప్రతిష్ఠ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రగతిని వాసుస్వామి, శేషుస్వామిలతో కలసి పరిశీలించారు. విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటుకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ ఫిబ్రవరికి వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆలయ నిర్మాణ పర్యవేక్షకులు జొన్నాడ చినబాబు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు మల్లిపాముల గణపతి తదితరులు ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట ఉన్నారు.



ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లపై స్వామీజీలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

17న పెన్షనర్స్ డే

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ డేను నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పద్మనాభం తెలిపారు. అర్బన్ ఎంఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో వేడుకలు జరుగుతాయన్నారు. సభ్యులు హాజరుకావాలని పద్మనాభం కోరారు.

ఉత్సాహంగా ముందస్తు క్రిస్మస్

- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

బోట్‌క్లబ్: స్థానిక కల్వరీ టెంపుల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దైవజనులు పి.సతీష్‌కుమార్ బైబిల్‌లోని పలు వాక్యాలను, అంతరార్థాన్ని తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు జననాన్ని వివరిస్తూ సాగిన నాటిక ఆకట్టుకున్నాయి. సీబీసీఎన్‌సీ అధ్యక్షుడు ముత్తాబత్తుల రత్నకుమార్, కాకినాడ కల్వరీటెంపుల్ ఇన్‌చార్జ్ జయరాజ్ అనిల్, సభ్యులు జల్లి అశోక్, జాన్సన్, భద్రం, హేమంత్ పాల్గొన్నారు.



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

విధేయుడిగా పనిచేస్తా

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్



కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల నియామకాలలో భాగంగా తనను క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించి బాధ్యతను పెంచారని, పార్టీ విధేయుడిగా పని చేస్తానని రాయుడు పాలేనికి చెందిన స్టీఫెన్ ఆనంద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను నియమించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాయుడుపాలెంలోని విలియన్స్ చారిటబుల్ చర్చ్‌లో ఆయనను శుక్రవారం అభినందించారు. విలియన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్‌గా ఉన్న స్టీఫెన్ ఆనంద్‌కు వైఎస్సార్ సీపీలో కీలక పదవి రావడంతో క్రిస్టియన్లు అభివృద్ధికి మేలు జరుగుతుందని పలువురు పేర్కొన్నారు.

శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం

- కలెక్టర్ కృతికా శుక్లా
- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులతో కలసి అమరజీవికి నివాళులు

కాకినాడ సిటీ: తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి చిరస్మరణీయమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. స్థానిక రామారావుపేట సీబీఎం స్కూల్–ఫెలోషిప్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులతో కలసి ఆమె నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే ద్వారంపూడి అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఈట్ల కిశోర్, బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారిణి ఎస్.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎ.విజయశాంతి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు పెద్ది రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, రామకృష్ణ, నాగమణి తదితరులు

కురసాల క్యాంపు కార్యాలయంలో..

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట వైద్య నగర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జమ్మలమడల నాగమణి, జెడ్పీటీసీ సురుకుర్తి రామకృష్ణ అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరవలేదన్నారు. గంజా సత్తిబాబు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, పుల్ల చందు, భువనేశ్వరి, దైవ కృప తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి